ప్రజాశక్తి

సోమవారం 24 ఏప్రిల్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అప్పన్న చందనోత్సవంలో..

దర్శన కష్టాలు

- కొంపముంచిన వివిఐపిల అంతరాలయ సేవలు
- గంటల తరబడి కదలని సాధారణ భక్తుల క్యూలైన్లు
- ఏర్పాట్లుపై మంత్రులను నిలదీసిన యాత్రికులు




సింహాచలానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - సింహాచలం : చందనోత్సవ ఏర్పాట్లులో ప్రభుత్వం, అధికారుల వైఫల్యంతో సామాన్య భక్తులకు ఈసారీ ఇక్కట్లు తప్పలేదు. వివిఐపిల దర్శన సమయంలో గతేడాది అనుభవాలే ఈసారీ ప్రస్ఫుటమయ్యాయి. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అభాసుపాలైంది. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల కల్పన అధ్వానంగా ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సుమారు రెండు లక్షల మంది



క్యూ లైన్లలో
భక్తుల తోపులాట



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అశోక్ గజపతిరాజు

అప్పన్న నిజరూప దర్శనం చేసుకున్నారని దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు.

అప్పన్న నిజరూప దర్శనాన్ని తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక గజపతిరాజు దంపతులు చేసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, టిటిడి తరుపున వైవి,సుబ్బారెడ్డి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శనాలు చేసుకున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులకు, వివిఐపిలకు స్వామి దర్శనం కల్పించారు.

లెక్క తప్పింది..!

దేవస్థానం లెక్కల ప్రకారం ఆరు వేల మందికి రూ.1500 టిక్కెట్లు విక్రయించి అంతరాలయ దర్శనాలు కల్పిస్తామని తెలిపిన అధికారులు లెక్కకు మించి దర్శనాలు కల్పించడంతో సామాన్య భక్తులతో పాటు వివిఐపిలకూ ఇక్కట్లు తప్పలేదు. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు ఉదయం 10 గంటల తర్వాత అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు. అప్పటికే వేలాది సంఖ్యలో వివిఐపిలతోపాటు సామాన్య భక్తులు గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నారు. వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు భక్తులు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 26న బహిరంగ సభ

వేలాదిగా తరలిరండి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం పిలుపు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరుగనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన రెండో రోజు కొనసాగింది. ముఖ్య వక్తగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కొత్తగా ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయకపోగా ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తామని చెప్పి పదే, పదే ప్రకటనలు చేయడం సరైనది మిగతా 2లో..

ఆకట్టుకున్న సౌజన్య అభినయం

నేత్రపర్వంగా మీనాక్షీ కల్యాణం కూచిపూడి నృత్యరూపకం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి సౌజన్య త్రివిక్రమ్ అభినయం, నాట్య ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేసింది. వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం ప్రదర్శించిన మీనాక్షీ కల్యాణం కూచిపూడి సంప్రదాయ నృత్యరూపకం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. ప్రఖ్యాత సినీదర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సౌజన్య ఇందులో మధుర మీనాక్షిగా ముఖ్యభూమికలో పరకాయ ప్రవేశం చేసి రసహృదయాలను కొల్లగొట్టారు. కూచిపూడి మిగతా 2లో..



విశాఖ పోర్టు ఆస్తుల ప్రైవేటీకరణపై నిరసన

వార్త మెయిన్‌లో..

శిల్పారామం అభివృద్ధిపై దృష్టి

వార్త 2లో..

మూల్యాంకన పరీక్ష

వార్త 2లో..

ఉత్తమ పంచాయతీలు

- రాష్ట్ర స్థాయిలో నాలుగు
- జిల్లా స్థాయిలో 27 ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉత్తమ పంచాయతీలుగా రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన నాలుగు పంచాయతీలు ఎంపికయ్యాయి. తొమ్మిది కేటగిరీల్లో మూడు కేటగిరీల కింద ఎంపికైన నాలుగు పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం అమరావతిలో అవార్డులు అందజేయనున్నారు. ఆరోగ్య పంచాయతీ కింద రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు స్వగ్రామమైన దేవరాపల్లి మండలం తారువతో పాటు పాడేరు ఏజెన్సీలోని హుకుంపేట మండలంలోని భీమవరం, మంచి పరిపాలన కింద భీమునిపట్నం మండలంలోని నగరపాలెం, మహిళల స్నేహపూర్వక పంచాయతీ కింద అనకాపల్లి మండలంలోని మార్టూరు ఎంపికయ్యాయి. తొమ్మిది కేటగిరీల కింద జిల్లా స్థాయిలో 27 పంచాయతీలు ఎంపికయ్యాయి. ఎంపికైన అనకాపల్లి జిల్లాలోని 20, పాడేరు డివిజన్‌లోని ఐదు, విశాఖపట్నం జిల్లాలోని రెండు పంచాయతీలకు ఆయా జిల్లా స్థాయిల్లో అవార్డులు అందజేయనున్నారు.

కేటగిరి		ఎంపికైన పంచాయతీలు
పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలు పెంచడం	:	చీడిగుమ్మల, కిల్లంకోట, ఎన్.నర్సాపురం
ఆరోగ్యకర పంచాయతీ	:	తారువ, భీమవరం, కొత్తూరు
పిల్లల సంక్షేమం	:	దాలివలస, కింతలివల్లపురం, ములకలపల్లి
సమృద్ధిగా తాగునీరు సరఫరా	:	దీక్షితుల అగ్రహారం, ఎన్.కొత్తూరు, బుడ్డింపేట
పరిశుభ్రత, పచ్చదనం	:	జి.మాడుగుల, మినుములూరు, చూచికొండ
మౌలిక సదుపాయాలు బాగున్నవి	:	ఆరిపాక, వెల్చేరు, కింతాడ కోటపాడు
సాంఘిక భద్రత	:	గోపాలపురం, పిప్పళ్ల కొత్తపల్లి, బయ్యవరం
మంచి పరిపాలన	:	నగరపాలెం, గడుతూరు, పెదతీనార్ల :
మహిళల స్నేహపూర్వక పంచాయతీ	:	మల్లవరం, నగరపాలెం, మార్టూరు

మొదటి పేజీ తరువాయి..

దర్శన కష్టాలు

సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణలను చందనోత్సవ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిలదీశారు. శారదా పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి కూడా ఏర్పాట్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇలాంటి చందనోత్సవం ఎన్నడూ చూడలేదన్నారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందిస్తూ యధారాజ తథా ప్రజ అన్నట్టు ముఖ్యమంత్రి, అధికారుల తీరు ఉందని విమర్శించారు.

ఎన్నో అవస్థలు

ఘాట్ రోడ్డులో వందల వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. ట్రాఫిక్ జామ్ అయింది. కొంత మంది భక్తులు వాహనాలను మధ్యలోనే నిలిపేసి కాలినడకన అప్పన్న దర్శనానికి వచ్చారు. ప్రోటోకాల్ క్యూ లైన్‌లో విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అనకాపల్లి ఎంపీ బివి.సత్యవతి రెండు గంటలపాటు ఇరుక్కుపోయారు. సామాన్య భక్తులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యమూ కరువయ్యాయి. భక్తులకు సేవలు అందించేందుకుగాను ప్రతిఏటా వచ్చే 80కి పైగా స్వచ్ఛంద సేవా సంఘాల వారు ఈసారి పెద్దగా కనిపించలేదు.

దర్శనం చేసుకున్న ప్రముఖులు

ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, పేర్ని నాని, విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అనకాపల్లి ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు గణబాబు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజు, తదితరులు అప్పన్న నిజ రూప దర్శనం చేసుకున్నారు.

గాయపడ్డ కానిస్టేబుల్

ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో ఉన్న విశాఖపట్నం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జగదీష్ కాలి పై నుంచి ఆర్‌టిసి బస్సు వెళ్లిపోవడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు.

వైఫల్యాలపై వివరణ ఇవ్వండి : బాల హక్కుల పరిరక్షణ కమిషన్

చందనోత్సవంలో బాలలకు సరైన సదుపాయాలు కల్పించకపోవడంపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం ఆదేశించారు.

సంతృప్తికరంగా ఏర్పాట్లు : మంత్రి కొట్టు సత్యనారాయణ

అప్పన్న నిజరూప దర్శనానికి రెండు లక్షల మంది భక్తులు వచ్చినట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. ఆదివారం సింహాచలం దేవాలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏర్పాట్లుపై సంతృప్తికరంగా ఉన్నారన్నారు. నెల రోజులుగా ఏర్పాట్లుపై దృష్టి సారించినట్టు తెలిపారు. ఘాట్ రోడ్‌లో ఒక వాహనం మరమ్మతుకు గురికావడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయన్నారు. సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ పెరిగిందన్నారు. రెండు, మూడు స్లాట్‌లలో టిక్కెట్లు పొందిన భక్తులు ఒకేసారి దర్శనానికి రావడంతో సమస్య తలెత్తినట్టు వెల్లడించారు. సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ సీర సత్యనారాయణ, చందనోత్సవాల ప్రత్యేక అధికారి ఆజాద్, ఆలయ ఇఒ త్రినాథ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 26న బహిరంగ సభ

కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకునేందుకు అఖిలపక్ష పార్టీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి నాయకులను ప్రధాని మోడీ వద్దకు తీసుకువెళ్లాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి చేస్తున్న ప్రకటనలపై వైసిపి, టిడిపి, జనసేనలు కనీసం మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా, మెట్రో రైలు, రైల్వే జోన్‌కు నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తుంటే ప్రాంతీయ పార్టీలు తొత్తుగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా 26న జరుగనున్న బహిరంగ సభలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, యుఎస్ఎన్.రాజు, వి.నరేంద్ర కుమార్, బి.వెంకటరావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సౌజన్య అభినయం

సంప్రదాయ నృత్యరీతిలోనేగాక మరే ఇతర భారతీయ సంప్రదాయ నృత్యరీతిలోనూ సంపూర్ణ ప్రదర్శనా కథనంగా మునుపెన్నడూ వెలుగు చూడని మధుర మీనాక్షీ అమ్మవారి ఇతివృత్తాన్ని అద్భుతంగా నృత్యపరికల్పన చేసిన పసుమర్తి రామలింగశాస్త్రి విమర్శకుల మన్ననలందుకున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రఖ్యాత కార్టూనిస్టు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయిత భమిడిపల్లి నరసింహమూర్తి రచించిన ఈ మీనాక్షీ కల్యాణం కూచిపూడి నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది. సుమారు రెండున్నర గంటల నిడివిలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ ప్రదర్శనను బాలాజీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, డాక్టర్ ఎలైట్ డయాగ్నొసిస్ సంస్థల సౌజన్యంతో సంప్రదాయ నృత్యప్రియుల కోసం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విశాఖ సాహితి అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని, గౌరవ అతిథులుగా ఎమ్మార్సీ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, బాలాజీ విద్యా సంస్థల ఛైర్మన్, బాలాజీ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మండవ రవికుమార్ హాజరయ్యారు.

మూల్యాంకన పరీక్ష

ఎఎంఎ హైస్కూల్‌లో అరకొర సౌకర్యాలు
ఎండల తీవ్రత, ఉక్కబోత
భయపడుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

పదో తరగతి పరీక్షా పేపర్ల మూల్యాంకనం ఉపాధ్యాయులకు ఒక పరీక్షలా మారింది. మండుతున్న ఎండలు, ఉక్కబోత మధ్య పేపర్లు దిద్దుతున్న ఉపాధ్యాయులు కనీస సౌకర్యాల్లేక విలవిల్లాడుతున్నారు. మూల్యాంకనం జరుగుతున్న అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఎఎంఎ హైస్కూల్‌లో మరుగుదొడ్లు కూడా సరిగాలేవని ఉపాధ్యాయులు వాపోతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న, 58 ఏళ్లు నిండిన ఉపాధ్యాయులను మూల్యాంకనం నుంచి మినహాయించాలన్న ప్రభుత్వ సూచనలను విద్యాశాఖాధికారులు పట్టించుకోవడంలేదు. వారికి కూడా మూల్యాంకన బాధ్యతలు అప్పగించడంతో వారంతా ఎండలకు భయపడుతున్నారు. 40 మందిలోపు విద్యార్థుల సామర్థ్యం కలిగిన తరగతి గదిలో 45 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఈ మూల్యాంకన గదిలో రెండు ఫ్యాన్లు, ఒక లైట్ మాత్రమే ఉన్నాయి. గది అంతటికీ గాలి తగలక ఉక్కబోతతో ఉపాధ్యాయులు బాధపడుతున్నారు. గదంతటికీ సరైన వెలుతురు ఉండడం లేదని వారు చెబుతున్నారు.

స్థానికంగా పదో తరగతి ఆరు సబ్జెక్టులకు మూల్యాంకనం జరుగుతోంది. సబ్జెక్టుకు మూడు గదులు చొప్పున కేటాయించారు. తరగతి సామర్థ్యానికి మించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో ఎదురవుతున్న ఇబ్బందులను విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని అంటున్నారు. కొద్ది రోజుల క్రితం బాపట్లలో ఒక ఉపాధ్యాయుడు మృతిచెందిన విషయం గుర్తుచేసుకుంటూ ఆందోళన చెందుతున్నారు. వెయ్యి మంది ఉపాధ్యాయులు ఎఎంఎ హైస్కూల్‌లో పేపర్లు దిద్దేపనిలో ఉన్నారు. వీరికి రెండు పూటలా మజ్జిగ ఇవ్వడంతో పాటు సరిపడనంత తాగునీరు అందుబాటులో వుంచాలి. ఉదయం 10, మధ్యాహ్నం 15 క్యాన్లు నీళ్లు మాత్రమే తెస్తుండటంతో సరిపోవడంలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్లు వైద్యుల నుంచి పొందిన ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోకుండా మూల్యాంకన పనులు అప్పజెప్పినట్లు కొందరు ఉపాధ్యాయులు వాపోతున్నారు. మరోవైపు మూల్యాంకన కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించినట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

శిల్పారామం అభివృద్ధిపై దృష్టి

వాటర్ వరల్డ్‌కు పెరుగుతున్న ఆదరణ
'ప్రజాశక్తి'తో శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పిఎం.పాలెం : **'విశాఖ నగరంలో పల్లెటూరు వాతావరణమంతా కలబోసినట్టు కనిపించే ప్రాంతం మధురవాడ శిల్పారామం. ఇది దినదినాభివృద్ధి చెందుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. అంతరించిపోతున్న చేనేత హస్తకళలకు, సాంస్కృతిక, జానపద కార్యక్రమాలకు ప్రాణం పోస్తూ ముందుకెళ్తోంది. రాష్ట్రంలో విశాఖను కీలకంగా భావించి పలు చర్యలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం శిల్పారామం అభివృద్ధికీ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే బోలెడు సదుపాయాలు కల్పించింది' అని శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.**





వాటర్ వరల్డ్ ఎలా ఉంది..?

పిపిపి పద్ధతి ద్వారా ప్రైవేటు సంస్థకు శిల్పారామంలో కొంత స్థలాన్ని లీజుకు ఇచ్చి వాటర్ వరల్డ్‌కు అనుమతులు జారీ చేశాం. ఇప్పుడు ఇది పర్యాటకులను ఆకట్టుకుంటోంది. రోజుకి వంద మంది, ఆదివారం 200 పైచిలుకు మంది వస్తున్నారు. క్రమేపీ తాకిడి పెరుగుతోంది.

ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులు ఎంతవరకూ వచ్చాయి ?

శిల్పారామం ఆవరణలో ఉన్న శిల్పాలకు రూ.40 లక్షల నిధులతో రంగులద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే రూ.15 లక్షలు ఖర్చు చేశాం.

యోగా కేంద్రం పనులు ఎంతవరకూ వచ్చాయి ?

వ్యాయామం చేసుకునే వారి తాకిడి కూడా శిల్పారామానికి పెరిగింది. వారిని దృష్టిలో పెట్టుకొని దివీస్ సంస్థ సహకారంతో ఎనిమిది లక్షల రూపాయల నిధులతో యోగా కేంద్రాన్ని నిర్మిస్తున్నాం. నెల రోజులలో ఇది అందుబాటులోకి రానుంది.

వస్త్ర ప్రదర్శనలు ఎలా సాగుతున్నాయి ?

గత డిసెంబర్‌లో చేపట్టిన హ్యాండ్లూమ్ వస్త్ర ప్రదర్శన, దాని తర్వాత చేపట్టిన లేపాక్షి హ్యాండ్లూమ్స్, జి 20 పేరిట నిర్వహించిన లేపాక్షి స్టాల్స్ ద్వారా పర్యాటకులను ఆకట్టుకున్నాం. ముమ్ముందు మరిన్ని నిర్వహిస్తాం.

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల తీరేంటి ?

ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నాం. అంతరించిపోతున్న సాంస్కృతిక కళలకు ప్రాణం పోయాలన్నదే మా తపన. ప్రస్తుతం శిల్పారామానికి నెలకు 10 వేల నుంచి 12 వేల మంది పర్యాటకులు వస్తున్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తాం.

తొలగించిన సిలబస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - **ఎంవిపి.కాలనీ :** నూతన విద్యా విధానం పేరుతో సిలబస్ నుంచి తొలగించిన అంశాలను తిరిగి జత చేయాలని కోరుతూ సౌత్ ఇండియన్ అలయన్స్ ఫర్ ఫండ్‌మెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్ రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం మీడియాకు వివరించారు.

శీహరి మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఎంవిపి.**కాలనీ :** ఆచార్య రవ్వ శ్రీహరి మృతి దిగ్భ్రాంతి కలిగించిందని ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కెఎస్.చలం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన నుంచే తాను విసిగా బాధ్యతలు తీసుకున్నట్టు గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు నుంచీ ఆయనతో పరిచయం ఉందని తెలిపారు.

ఇది తాగునీరేనా..?



లేత పసుపు రంగులో ఉన్న కుళాయి నీరు

- శుద్ధి చేయకుండానే సరఫరా
- రంగు మారిన నీటితో స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : గత కొంత కాలంగా జివిఎంసి సరఫరా చేసే తాగు నీరు లేత పసుపు రంగులో ఉండడం, నీటిలో చిన్నపాటి చెత్త ఉండడం, దుర్వాసన, నీటి మీద ఆయిల్ వలే తెడ్డు తేలడం వంటివి స్థానికులు చూస్తున్నారు. ఇది అంతా చూస్తే నేరుగా చెరువు నీటినే జివిఎంసి తాగు నీటిగా సరఫరా చేస్తుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా 12వ వార్డు పరిధి శ్రీలీలాసుందరయ్యనగర్, టిఐసి పాయింట్, నెహ్రూనగర్, సుందరయ్యనగర్ పరిసర ప్రాంతాలకు జివిఎంసి సరఫరా చేసే తాగు నీటి పరిస్థితి ఇలా ఉంది. జివిఎంసి సరఫరా చేసే ఈ నీటిని స్థానికులు తాగలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటిని తాగితే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని భయపడుతున్నారు. అలా అని బయట నీటిని కొనుక్కొని తాగాలంటే ధర భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి సరఫరా చేసే నీటిలోనే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ నీటిని శుద్ధి చేయడంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా రిజర్వాయర్ నీటిని శుద్ధి చేసే గ్యాలరీకి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయినా పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకొని రిజర్వాయర్ నీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో లింగంపేట గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న 20 మద్యం సీసాలను పట్టుకున్నామని గొలుగొండ ఎస్ఈబి సిఐ రాజారావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అక్రమ మద్యం నిల్వలు ఉన్నాయన్న ముందస్తు సమాచారం అందడంతో లింగంపేట గ్రామంలో శనివారం రాత్రి కొత్తూరు ప్రసాద్ అనే వ్యక్తి ఇంటిపై దాడులు చేశామన్నారు. ఈ దాడులలో పాండిచ్చేరి రాష్ట్రానికి చెందిన 20 మద్యం సీసాలు పట్టు పడ్డాయన్నారు. ప్రసాద్‌ను గొలుగొండ ఎక్సైజ్ స్టేషన్ కు తరలించామన్నారు. మద్యం సరఫరాదారుడైన పెద్ద బొడ్డేపల్లి గ్రామానికి చెందిన తుంపాల రత్నబాబును అరెస్టు చేశామని ఆయన తెలిపారు. ఈ దాడులలో ఎస్సై గిరి, సిబ్బంది పాల్గొన్నారు.



అవిలా వర్సిటీ ప్రతినిధులతో శశి విద్యా సంస్థల యాజమాన్యం ఎంఒయు

అవిలా వర్సిటీతో శశి ఎంఒయు

ప్రజాశక్తి -తగరపువలస : యునైటెడ్ స్టేట్స్‌లోని మిస్సోరియాకు చెందిన అవిలా యూనివర్సిటీతో స్థానిక శశి ఇంజినీరింగ్ కళాశాల ఆదివారం సంగివలస శశి స్కూల్‌లో ఎంఒయు కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా రీసెర్చ్, విద్యాపరంగా ఎంతో అభివృద్ధి సాధించగలరని శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ చెప్పారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలంటే అవిలా వర్సిటీకి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శశి విద్యా సంస్థల కరస్పాండెంట్ మేకా క్రాంతిసుధ, ప్రిన్సిపల్ మహమ్మద్ ఇస్మాయిల్, అవిలా యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

శశిలో అవగాహన సదస్సు

టెన్త్ విద్యార్థులకు స్థానిక సంగివలస శశి విద్యా సంస్థలో ఆదివారం ఐఐటి, జెఇఇ, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునుద్దేశించి శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తి గత శ్రద్ధ ఉంటుందన్నారు. చదువులో మెరుగైన ఫలితాలు సాధించేలా నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ విద్యా సంస్థపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ఏటా సాధిస్తున్న పరీక్షా ఫలితాలే నిదర్శనమన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ, తాము విశాఖలో సంస్థ ప్రారంభించిన నాటి నుంచి తక్కువ సమయంలోనే ఏటా ఐఐటి, నీట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి పట్ల క్రమ శిక్షణ, వ్యక్తి గత శ్రద్ధ ఉంటుందన్నారు. టెన్త్ ఇంటర్‌తో పాటు జాతీయ స్థాయి పరీక్ష లైన ఐఐటి, జెఇఇ, నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నట్లు తెలిపారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరైన ఈ సదస్సులో కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

25న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-మధురవాడ : రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తూ, జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 25న విశాఖ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ప్రతినిధి సుమన్, జిల్లా ఇన్‌ఛార్జి నల్లి మోహన్, నాయకులు సురేష్, బ్రహ్మం, గోపి, సాయి, గౌతమి, జయశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాకు జిల్లాలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

యోగా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ముడసర్లోవ రోడ్డు స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలోని వాకర్స్ మందిరంలో ఆచార్య సౌమ్యానంద అవధూత పర్యవేక్షణలో ఉచిత యోగా శిక్షణా తరగతులను ప్రారంభించారు. ప్రతి ఆదివారమూ ఉదయం 6.30 గంటల నుంచి యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి, కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు శంకరరావు, పిల్లి వీర్రాజు, బాలస్వామి, డి.సంతోష్, శ్రీనివాస్, శేఖర్, మహిళా వాకర్స్ పాల్గొన్నారు.

శ్రీదుర్గా కాశీవిశ్వేశ్వర ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో శ్రీ దుర్గా కాశీ విశ్వేశ్వరదేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పీఠాధిపతులు హాజరై ప్రవచనాలు చేశారు. గంగాపురం కాశీమఠయాల విశ్వేశ్వరస్వామి పీఠాదిపతి పరమాత్మానందగిరిస్వామి కొందరు దంపతులను ఆశీర్వదించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కనకల బంగారునాయుడు పాల్గొన్నారు.

ముగిసిన విజ్జీస్ మధురవాడ ప్రీమియర్ లీగ్

టైటిల్ విజేత చంద్రంపాలెం ఎస్ఎన్‌డి టైగర్స్



ట్రోఫీతో క్రీడాకారులు

ప్రజాశక్తి-పిఎం.పాలెం : మధురవాడ యువత బైపిల్లి ప్రసాద్ పర్యవేక్షణలో ఏప్రిల్ 15 నుంచి 23వ తేదీ వరకు జరిగిన విజ్జీస్ మధురవాడ ప్రీమియర్ లీగ్ (ఎంపిఎల్) ఘనంగా ముగిసింది. ఆదివారం సాయంత్రం మధురవాడ క్రికెట్ స్టేడియం బి.మైదానంలో విజేతలకు ట్రోఫీ, మెమెంటోల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 8ప్రధాన జట్లు పోటీ పడిన క్రికెట్ మ్యాచ్‌లలో కెవిఆర్ కేటరింగ్ అధినేత గరె గురునాథ్‌కు చెందిన చంద్రంపాలెం ఎస్ఎన్‌డి. టైగర్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. రెండో స్థానాన్ని బివిపి.బుల్స్, మూడో స్థానాన్ని కొమ్మాది లయన్స్, నాలుగో స్థానాన్ని మధురవాడ రాక్ స్టార్స్ కైవసం చేసుకున్నాయి. బెస్ట్ బ్యాట్స్‌మ్యాన్ వాండ్రాసి భాస్కర్ (బికెపి రాయల్ స్ట్రైకర్స్), బెస్ట్ బౌలర్ సంతోష్ కుమార్ (విపి బుల్స్), బెస్ట్ ఆల్ రౌండర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గణేష్ (కొమ్మాది లయన్స్) నిలిచారు. ఈ సందర్భంగా సచిన్ టెండుల్కర్ 50వ జన్మదిన సందర్భంగా 50 కిలోల కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హనీ గ్రూప్ ప్రతినిధి ఓబులరెడ్డి, నగరాల కార్పొరేషన్ చైర్పన్ పిల్లా సుజాత, సత్యనారాయణ, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపాహనోక్, 7వ వార్డు కార్పొరేటర్ పిల్ల మంగమ్మవెంకట్రావు, మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నక్కా శ్రీధర్, మారుతి బాక్సింగ్ క్లబ్ వ్యవస్థాపకులు వంకాయల మారుతీప్రసాద్, జగ్గపిల్లి అప్పలరాజు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ముదుండి రాజేశ్వరి, ఉమెన్,చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ మంతెన మాధవీవర్మ, ఎమ్.డి.అహమ్మద్, పోతిన ఎల్లాజీ, పోతిన శివ, సంయుక్తంగా టైటిల్ జట్టుకు రూ. ఒక లక్ష, రన్నర్‌కు రూ.50 వేలు, ట్రోఫీలను అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నైపుణ్యంతో క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ ఈవెంట్స్ గురునాథ్, కనకదుర్గ ఈవెంట్స్ కొర్రాయి సురేష్, నాగోతి వెంకట సత్యనారాయణ (జపాన్), పోతిన సోంపాత్రుడు, పోతిన చిన్ని, జగ్గపిల్లి నరేష్, పొట్టి ప్రసాద్, పోతిన హనుమంతు, సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలాస్ వోగ్ వార్షికోత్సవం



భరత నాట్య కళాకారులకు ఆభరణాలను అందిస్తున్న ఎస్ఐ సునీత, చైర్మన్ సౌమ్య

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ చంద్రంపాలెం సమీపంలోని టీవీఎస్ షోరూం పక్కన ఉన్న వెన్నెలాస్ వోగ్ కాస్మెటిక్స్, లిమిటేషన్ జ్యూయలరీ, ఫ్యాషన్ జ్యూయలరీ షోరూం రెండోవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పిఎం.పాలెం లా అండ్ ఆర్డర్ ఎస్ఐ పి.సునీత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేక్ కట్ చేసి 2వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. 2వ వార్షికోత్సవం సందర్భంగా 20 మంది భరతనాట్య నృత్య కళాకారులకు ఆభరణాలను సంస్థ యాజమాన్యం అందించింది. అనంతరం ఎస్ఐని వెన్నెలాస్ వోగ్ చైర్మన్ పి సౌమ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, భారతీయ సంప్రదాయ, సాంస్కృతిక కళలకు ప్రాధాన్యతనిస్తూ, నిరుపేద నృత్య కళాకారులకు చేయుతనిస్తూ రూ.3వేల విలువైన భరతనాట్యం ఆభరణాలిచ్చి ప్రోత్సహించిన వెన్నెలాస్ వోగ్ సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. సంస్థ చైర్మన్ పి సౌమ్య మాట్లాడుతూ, వెన్నెలాస్ వోగ్ స్థాపించి కాస్మెటిక్స్, లిమిటేషన్ జ్యూయలరీ, ఫ్యాషన్ జ్యూయలరీ తదితర అన్ని రకాల బ్రాండెడ్ కాస్మొటిక్స్ అమ్మకాలను చేపట్టి మహిళల ఆదరణ పొందుతున్నామని తెలిపారు. అతి తక్కువ ధరకే మంచి క్వాలిటీ కలిగిన జ్యూయలరీ వస్తువులను అందిస్తున్నామని తెలిపారు. రెండవ వార్షికోత్సవం సందర్భంగా దాదాపుగా వెయ్యి మంది మహిళలకు గాజుల సెట్లును ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన హెల్త్‌సిటీలోని జిజ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం వైసిపి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆరిలోవ కాలనీ పరిసర ప్రాంతాల నుంచి రోగులు సుమారు 100 మందికి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు శివప్రసాద్, ఫిజియోథెరపిస్ట్ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, జిజ ఆసుపత్రి మేనేజర్ అరుణ్ కుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


కియా కారును మార్కెట్‌లోకి విడుదలచేస్తున్న ఓలేటి నరేష్

కియా ఇవి 6 విడుదల

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా ఇండియా తన సరికొత్త ఎలక్ట్రిక్ కార్‌ను వైజాగ్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. సరికొత్త కియా ఇవి6 ఆంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటిసారి నగరంలోని లక్ష్మి కియా బిర్లా జంక్షన్ షోరూంలో ప్రముఖ వ్యాపారవేత్త, సింబయాసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత ఓలేటి నరేష్ మార్కెట్‌లోకి విడుదల చేశారు. అద్భుతమైన సదుపాయాలు, స్పీడ్‌తో సరికొత్త ఈవి6 708 కిలోమీటర్ల మైలేజ్ రేంజ్ కలిగి, 8 ఎయిర్ బాగ్స్, 325 హార్స్ పవర్, అత్యంత వేగవంతమైన ఈవి6 కేవలం 5.2 సెకన్లలో సున్న నుంచి 100 స్పీడ్ చేరుకుంటుందని వివరించారు. కియా తన ప్రారంభ ఆఫర్‌గా ఆల్ ఇండియాలో మొట్ట మొదటి 200 కొనుగోలుదారులకు ఐదేళ్ల పిరియాడిక్ మెయింటెనెన్స్, 8 ఏళ్ల లేక 1.6 లక్షల కిలోమీటర్ల వరకు వారంటీని అందజేస్తున్నారు.


మధురానగర్ హైస్కూల్ వద్ద కెకె.రాజు సెల్ఫీ

గంటాకు కెకె.రాజు సెల్ఫీ చాలెంజ్

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎయు కన్వెన్షన్ సెంటర్ భవనం వద్ద నిల్చొని సెల్ఫీ ఫొటో తీసుకొని ట్విట్టర్ పెట్టిన నేపథ్యంలో ప్రతీగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. మీరు గెలిచిన నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూడాలని జివిఎంసి మధురానగర్ హైస్కూల్ వద్ద కెకె.రాజు సెల్ఫీ తీసుకొని ఆ ఫొటోలు ట్విట్టర్‌లో పెట్టారు.

ఎస్‌సి, ఎస్‌టి పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసిన ఎస్‌సి, ఎస్‌టి పథకాలను పునరుద్ధరించాలని, వీటిపై ఎస్‌సి, ఎస్‌టి మంత్రులు నోరు విప్పాలని విడసం రాష్ట్ర సమితి బహిరంగ లేఖలో డిమాండ్ చేసింది. ఆదివారం మధ్యాహ్నం ఎల్ఐసి కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ లేఖను విడసం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా విడసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి కోటాలో ఎన్నికై పదవులు అనుభవిస్తున్న మంత్రులు రాజ్యాంగ ధర్మాన్ని నెరవేర్చాలన్నారు. కనీసం ముఖ్యమంత్రి జరిపే సమీక్ష సమావేశాల్లోనైనా వీటిపై మంత్రులు నోరు విప్పి, రద్దు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. సోమవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమంపై సమీక్ష సమావేశం జరుగుతుందని తెలిసిందని, ఈ వేదికపై మంత్రులు కనీస బాధ్యతగా ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తేవాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన 20 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, కోల హరిబాబు, కస్తూరి వెంకటరావు, ఎస్.నూకరాజు, ఎఎస్‌కె.రాజేంద్రప్రసాద్, పి.వెంకటనాంచారయ్య, చాపల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి శాంతినగర్‌లో రూ.1,36,15,000తో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కట్టుమూరు సతీష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శాంతినగర్ కొండ కింద రూ.49లక్షలతో రెండు అంతస్తుల నూతన కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. శాంతినగర్ కొండపైన రూ.35లక్షలతో నూతన కళా వేదిక నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. శాంతినగర్ కొండపైన రూ.15.45లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ మరమ్మత్తులు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో రూ.19లక్షల వ్యయంతో రక్షణ గోడ, శాంతినగర్ కొండవాలు ప్రాంతంలో రూ.17.70లక్షలతో సీసీ మెట్లు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, బలిరెడ్డి గోవింద్, కె.చిన్న, వైఎస్ రాజు, నరసింగరావు, శ్రీను పాల్గొన్నారు.

'బిఎన్ఆర్'కు ఇసిజి వితరణ


ఇసిజి గదిని ప్రారంభిస్తున్న భాస్కర్‌రామ్

ప్రజాశక్తి -కంచరపాలెం : రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌజన్యంతో కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో నిర్వహిస్తున్న బిఎన్ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు ఇసిజి మిషన్‌ను రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌టిఎన్ భాస్కర్‌రామ్.వి బహుకరించారు. ఇసిజి సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రామ్ మాట్లాడుతూ, అన్ని రంగాల ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బిఎన్ఆర్ ఫౌండేషన్ ప్రజలలో ఎంతో ప్రాచుర్యం పొందడం అభినందనీయమని కొనియాడారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి మాట్లాడుతూ, బిఎన్ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్‌లో రోగులకు అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు నామమాత్రపు ఫీజుతో చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ తిమ్మయ్య గాంధీ, ప్రెసిడెంట్ బి.మధు, మోదాంబిక, బిఎన్నార్ ఫౌండేషన్ ప్రతినిధులు అప్పలరాజు, కృష్ణారావు, సతీష్, బిజి.రాజు, పి.సావిత్రి, ప్రభాకర్, విజయ పాల్గొన్నారు

డెంటల్, స్కిన్ కార్నర్ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : చిన్నగంట్యాడ జాతీయ రహదారిలో తనిష్క్ గోల్డ్ షోరూం మేడపైన ఆధునిక ఎక్విప్‌మెంట్ గల డెంటల్, స్కిన్ కార్నర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గాజువాక నియోజకవర్గం రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి మూల స్తంభం అన్నారు. ఈ ప్రాంతంలోని కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం చేయాలని, మున్ముందు ఈ ఆసుపత్రి అత్యున్నత స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు.

ఆసుపత్రి డాక్టర్ ఎ.హనుజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, గాజువాక మున్సిపాలిటీ మాజీ చైర్మన్ రాజు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, ఉరుకుటి చంటి, ఉక్కు కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, బలిరెడ్డి సత్యనారాయణ, మురళీరాజు, స్థానిక నాయకులు వెంకన్నబాబు రాజు, బాలాజీ ఆసుపత్రి యాజమాన్యం ఎం.వెంకటేశ్వరరావు, ఎం.అవినాష్, బంధుమిత్రులు పాల్గొన్నారు.

చెస్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పాతకర్ణవానిపాలెంలోని బిజెపి సాహితీ సంస్థ అధినేత కరణంరెడ్డి నరసింగరావు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ, మే 6,7 తేదీల్లో వికాస్‌నగర్ ఆర్‌జిఐ స్టేడియంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అంధులు, వికలాంగులకు ప్రత్యేకంగా చెస్ పోటీలను ఎబిసి ట్రస్ట్, ఎఎన్ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగ వైకల్యం ఆటలకు ఆటంకం కాకూడదని, మనోధైర్యంతో అందరూ ప్రతిభ చాటాలని ఆయన పిలుపు నిచ్చారు. మూడు కేటగిరీల్లో విజేతలకు ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్ శ్రీను, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-యంత్రాంగం

పెందుర్తి : చందనోత్సవాన్ని పురస్కరించుకొని జివిఎంసి 94వ వార్డు జోనల్ కార్యాలయం వద్ద నాయుడుతోట హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసిపి నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ చలివేంద్రాన్ని మూడు నెలలు కొనసాగిస్తామని చెప్పారు. సుజాతనగర్ కూడలి వద్ద రాష్ట్ర కళింగ సేవాసంఘం సభ్యులు చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని నర్సింగరావు, చింతాడ సురేష్, పేరాడ శ్యామలరావు, కర్రి కృష్ణమూర్తి, తిర్లంగి శ్రీరామరాజు, మామిడి వెంకటరమణ,కంచిపాటి జగదీష్, బుజ్జి పాల్గొన్నారు.

ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యాన కీర్తిశేషులు రామ్‌రతన్ జ్ఞాపకార్థం జివిఎంసి అధికారి ఆర్.సోమన్నారాయణ, అన్నపూర్ణ పవర్ ప్రాజెక్ట్ అధినేత ఏగిరెడ్డి శ్రీనివాస్ ఆర్థిక సాయంతో ఆదివారం బాబా ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పాదచారులకు, ప్రయాణికులకు, స్థానికులకు ఆలయ కమిటీ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ, ఈ చలివేంద్రం హెల్త్‌సిటీకి వచ్చే రోగుల బంధువులకు, పాదచారులకు నెల రోజుల పాటు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

అల్లు రమేష్ మృతి బాధాకరం

ప్రజాశక్తి-సీతమ్మధార : రంగస్థల, టీవీ, సినీనటుడు అల్లు రమేష్ మృతి బాధాకరమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పేర్కొన్నారు. బాలయ్య శాస్త్రి లే అవుట్ సింధూర ఫంక్షన్ హాల్లో ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, రంగసాయి నాటక సంఘం సంయుక్తంగా ఏర్పాటుచేసిన అల్లు రమేష్ సంతాప సభలో దాడి సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నాటక దర్శకుడు చలసాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, అల్లు రమేష్‌తో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వై.అప్పారావు, బాదంగీర్ సాయి, యాదకుమార్, ఎం.ఎం.ప్రసాద్, బి.ధవళేశ్వరరావు, వి.నాంచారయ్య, ఎ.సురేష్, సూర్యకళ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టేబుల్ టెన్నిస్ దినోత్సవం

ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యాన ప్రపంచ టేబుల్ టెన్నిస్ దినోత్సవాన్ని ఆదివారం బీచ్ రోడ్‌లోని వైఎంసిఎ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు, ఎస్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రముఖ దంత వైద్యులు శ్రీధర్ హాజరై ప్రపంచ టేబుల్ టెన్నిస్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశాఖ జిల్లా నుంచి వివిధ జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్‌లను సత్కరించారు. ముఖ్య అతిథి గణబాబు మాట్లాడుతూ, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం వర్ధమాన క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. ఎస్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల 30న ఎస్ఎస్‌టిఎల్ క్లబ్ నందు ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ పోటీలు విశాఖ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్నామని ప్రకటించారు. జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ మాట్లాడుతూ, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యాన ఏపి స్టేట్ చాంపియన్ షిప్, మే 13, 14 తేదీలలో స్వర్ణభారతి స్టేడియంలో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల క్రీడాకారులతో టేబుల్ టెన్నిస్ లీగ్స్, మే 21న వెంకటేష్ మెమోరియల్‌లో జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెకె.నాయక్, ఇమ్మంది ప్రసాద్, టి.శ్రీకాంత్‌రాజు, ప్రభాకర్, వివిఎస్ఎన్.మూర్తి, ఎల్.కన్నబాబు, రోహిత్, సతీష్, రామారావు, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన ఆస్కార్ చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : 95వ ఆస్కార్ అకాడమీ అవార్డులు అందుకున్న మూడు రోజుల చిత్రాల ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ముగింపు సమావేశంలో వైజాగ్ ఫిలిం సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఫెస్టివల్స్ ద్వారానే ప్రపంచ సినిమాలు చూసే అవకాశం ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణకు అవసరమైన అన్ని హంగులతో ఉడా థియేటర్ ఉన్నప్పటికీ సినిమాలు ప్రదర్శనలు జరగడం లేదని తెలిపారు. టూరిజం అభివృద్ధికి ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహణ దోహదకారి కాగలదని పేర్కొన్నారు. అందుకు ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆస్కార్ అవార్డ్ పొందిన తేవాలే సినిమాను ప్రదర్శించారు. ప్రదర్శించిన సినిమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో బి.చిన్నారావు, హరనాథ్, మూర్తి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని న్యూపోర్ట్ ఎస్ఐ మన్మధ రావు సూచించారు. సమతనగర్ జంక్షన్‌లో ఓనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడారు. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడడానికి రక్తదానం ఎంతో ఉపయోగపడు తుందన్నారు. రక్తం కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న ఓనర్స్ ఫౌండేషన్‌ను అభినందించారు. 80 మంది యువకులు రక్తదానం చేశారు.

ఆక్రమణదారులతో రెవెన్యూ కుమ్మక్కు..

- ఆపై విద్యుత్ లైన్ ఏర్పాటు
- చెరువు గర్భం ఆక్రమణకు ప్రణాళిక
- మర్రి, తాటి చెట్లు తొలగింపు
- యథేచ్ఛగా వాల్టా చట్టానికి తూట్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

చెరువు మధ్యలోనుంచి వేసిన మట్టి రోడ్డు, విద్యుత్ స్తంభాలు



చెరువు మధ్య నుంచి రోడ్డు

సహజ వనరులు, భూగర్భ జలాలకు నష్టం వాటిల్లకుండా చెరువులు, వాగులు, గెడ్డలను యథాస్థితిగా ఉంచాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. వాటిని ఆక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కాని రెవెన్యూ యంత్రాంగం, ఇరిగేషన్ అధికారులు సుప్రీంకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఆక్రమణదారులతో కుమ్మక్కై కోట్లాది రూపాయల విలువైన చెరువులు, గెడ్డలు ఆక్రమణకు గురవుతున్న పట్టించుకోవడం లేదు.

ప్రజాశక్తి - పరవాడ

పరవాడ మండలం పెదముషిడివాడ రెవెన్యూ గ్రామం లంకెలపాలెం-సబ్బవరం రోడ్డుకు అనుకొని ఉంది. నివాసాలకు అనువైనదిగా ఎటువంటి కాలుష్యం లేని ప్రాంతం కావడం, ఈ గ్రామంలోనే ప్రభుత్వం 450 ఎకరాలకు పైగా భూ సమీకరణ చేసి జగనన్న ఇళ్ల స్థలాలను మంజూరు చేయడంతో ఇక్కడి భూములకు మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో కబ్జాదారులు, రియల్టర్లు, చెరువులు, గెడ్డలు ఏది కనిపిస్తే దానిని ఆక్రమించి తమ జిరాయితీ భూముల్లో కలిపేసి దర్జాగా ప్లాట్లు వేసుకొని అమ్ముకుంటున్నారు. ఇలాంటిదే పెదముషిడివాడ రెవెన్యూలో చోటుచేసుకుంది. ఈ రెవెన్యూలోని సర్వే నెంబరు 114లో 5 ఎకరాల 52 సెంట్లు విస్తీర్ణంతో లంకెలపాలెం-సబ్బవరం ప్రధాన రోడ్డు ఆనుకొని ఈసరపువాని చెరువు ఉంది. ఈ చెరువుకు ఆనుకొని జిరాయితీ భూమి కలిగిన ఓ రియల్టర్ స్థానిక వైసిపి నాయకుని అండతో, రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రధాన రోడ్డు నుండి ఈసరపువాని చెరువు గర్భం మధ్య గుండా తన స్థలం వరకు ఏడాది క్రితం మట్టి రోడ్డు వేశాడు. ఈ మట్టి రోడ్డు పక్క నుండి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, తన స్థలంలో వేసిన ప్లాట్లకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేశాడు. ఈ చెరువు మధ్యలో నుంచి వేసిన మట్టి రోడ్డును చూపించి తన జిరాయితీ భూమిలో వేసిన ప్లాట్లను విక్రయించాడు. ఈ మట్టి రోడ్డుకు అవతల ఉన్న సుమారు 2 ఎకరాల చెరువు గర్భాన్ని కూడా ఆక్రమించడానికి ప్రణాళిక వేశారు. ఇందులో భాగంగా ఈ చెరువు భూమిలో ఉన్న తాటి చెట్లు, మర్రి చెట్లు నరికివేసి పూర్తిగా తొలగించారు. ఆ భూమిలో ప్లాట్లు వేయడానికి సిద్ధపడుతున్నారు.

దీనిపై గతంలో రెవెన్యూ అధికారులకు ఈ చెరువు ఆయకట్టుదారులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా వచ్చి చెరువును చూసి వెళ్లిపోయారు తప్ప చెరువును ఆక్రమించి రోడ్డు వేసిన, చెట్లు నరికి తొలగించిన ఆక్రమణదారులపై ఏటువంటి కేసులు నమోదు చేయలేదు. ఈ చెరువును వైసిపి నాయకులు ఆక్రమించారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి గతంలో ఇక్కడికొచ్చి విలేకర్ల సమావేశం పెట్టి ఆర్భాటం చేశారు. రెవెన్యూ యంత్రాంగంపైనా, వైసిపి నాయకులపైనా విమర్శలు చేశారు. తరువాత ఏమి జరిగిందో గాని ఆయన సైలెంట్ అయిపోయారు.



చెరువు గర్భంలో ఉన్న తాటి చెట్లను నరికేసిన దృశ్యం

ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి ఈసరపువాని చెరువును పూర్తిగా సర్వే చేసి, చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని, చెరువు గర్భంలో వేసిన రోడ్డును, విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు గర్భం ఎండిపోకుండా ఉపాధి హామీ పథకం కింద పూడిక తీయించాలని, చెరువు ఆక్రమించి చెట్లు తొలగించి రోడ్డు నిర్మాణం చేసిన వారిపై వాల్టా చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తహశీల్దారు వివరణ

దీనిపై తహశీల్దార్ వి.ప్రకాశరావును ప్రజాశక్తి వివరణ కోరగా చెరువులో ఉన్నది కాలిబాట అని, రోడ్డు ఏర్పాటు చేయలేదని తెలిపారు. చెరువు భూమి ఆక్రమణ జరగలేదన్నారు. చెట్లు కొట్టేశారు కాదా అని అడిగితే అవి జిరాయితీ భూమిలో ఉన్న చెట్లు అని చెప్పారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 446 మందికి కంటి పరీక్షలు


16 మంది స్వచ్ఛందంగా రక్తదానం



రక్తదాన శిబిరంలో బ్రాండిక్స్ పార్టనర్ దొరైస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన 105వ ఉచిత వైద్య శిబిరంలో 446 మందికి కంటి పరీక్షలు చేశారు. 295 మందికి ఉచితంగా కంటి అద్దాలను బ్రాండ్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి అందజేశారు. 112మందికి మందులు ఇచ్చారు. 42మందిని కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వైద్య శిబిరానికి విచ్చేసిన రోగులకు మజ్జిగ ఫలహారాలు భోజనం సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో బ్రాండిక్స్ కంట్రీ హెడ్ నీల్‌రోసెరో, డిప్యూటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సర్వనన్ పాల్గొన్నారు.

వికలాంగులకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి - పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం గ్రామంలో వికలాంగులైన ముగ్గురు సంతానంతో నివసిస్తున్న చేపల కోదండమ్మకు పెందుర్తి నియోజకవర్గ జనసైనికులు విరాళాలుగా సేకరించిన రూ.60వేలు ఆర్థికసాయాన్ని అరిజిల్లి అప్పలరాజు ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. విరాళాలిచ్చి ఆదుకున్న జనసైనికులకు అప్పలరాజు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గండి దుర్గాప్రసాద్, బొండి ముత్యాలు, సమ్మంగి అప్పారావు, చింతకాయల ముత్యాలు, సమ్మంగి లోవరాజు, దేముడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి 'రుషిల్' కార్మికుల సమస్య



ఎమ్మెల్యే కన్నబాబురాజుకు సమస్యను విన్నవిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రుషిల్ డెకార్స్ ప్లైవుడ్ పరిశ్రమ ముఠా కార్మికుల సమస్య ఎట్టకేలకు ఎమ్మెల్యే కన్నబాబురాజు దృష్టికి వెళ్లింది. 19 రోజులుగా కార్మికులు దీక్షలు చేస్తున్నా అధికారులు, యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను ఆశ్రయించారు. ముఠాకార్మికులు, సిఐటియు ప్రతినిధులు, సెజ్ కార్మికులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించగా, సానుకూలంగా స్పందించి, పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎమ్మెల్యేనుకలిసిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, సెజ్ నిర్వాసిత ప్రతినిధులు ఎ.దేవుడు, విజయ్, లాలం శ్రీనివాస్, ముఠా కార్మికులు సూరిబాబు, నానాజీ వెంకన్న నాయుడు పాల్గొన్నారు.

దొంగతనాలపై విస్తృత ప్రచారం



ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - యలమంచిలి : వేసవిలో ఎక్కువ మంది ఇళ్లబయట నిద్రిస్తున్న కారణంగా దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సన్నిబాబు సూచించారు. ఆదివారం జాతీయ రహదారి పక్కనున్న గ్రామాల్లో జరుగుతున్న వేసవిలో చోరీలపై ఆటోలో మైక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ రూరల్ పోలీసులు విస్తృతంగా ప్రచారం చేశారు. విలువైన వస్తువులు, నగలు ఇళ్లలో ఉంచకుండా బ్యాంకుల్లో భద్రపరచుకోవాలని సూచించారు. శనివారం రేగుపాలెంలో జరిగిన దొంగతనం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లు విడిచి దూరప్రాంతాలకు క్యాంపులు వెళితే, పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి పోలీసు సేవలను వినియోగించు కోవాలని ఎస్ఐ సన్నిబాబు సూచించారు.

'చంద్రబాబు, లోకేష్‌లను విమర్శించే స్థాయి లేదు'



మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రబాబు, లోకేష్‌లను విమర్శించే స్థాయి మాడుగులకే పరిమితమైన ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు లేదని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు ఎద్దేవా చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముత్యాల నాయుడు మాడుగులను దాటి కనీసం జిల్లా అభివృద్ధిపై దష్టి సారించలేని అసమర్ధ మంత్రి అని ఆరోపించారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సిపిఎస్ రద్దు, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల, రెండు లక్షల 30 వేల ఉద్యోగాల కల్పన, మెగా డిఎస్‌సి, ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు వంటి హామీలను సాధించే సత్తా ఎలాగూ లేకున్నా, కనీసం జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకీకరిస్తామని ఇచ్చిన హామీలను కూడా అటకెక్కించారన్నారు. గడచిన నాలుగేళ్లలో పోలవరం, సుజల స్రవంతి ప్రాజెక్టులు ఒక్కడుగైనా ముందుకు కదలలేదన్నారు. ప్రజలను మభ్యపెట్టడం, ప్రతివిషయంలోనూ దృష్టి మళ్లించే చర్యలే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని మండిపడ్డారు. చంద్రబాబు లోకేష్ సభలకు వేలాదిగా వస్తున్న ప్రజలు, ప్రభుత్వంపై వ్యతిరేకత నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు విశాఖ పరిపాలన రాజధాని అంశాన్ని మళ్లీ తెరపైకి తెస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసిన వైసిపికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

నేడు మడకపాలెంలో గడపగడపకూ..

ప్రజాశక్తి పరవాడ: మండలంలోని కన్నూరు పంచాయతీ మడకపాలెంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని వైసిపి మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. వారితో ఎంపిపి పైలా వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్, జెడ్‌పిటిసి పిఎస్.రాజు, వైస్ ఎంపిపిలు బంధం నాగేష్, బూసి అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా రూ.76లక్షలతో మంత్రిపాలెం నుండి మడకపాలెం వరకు బిటి రోడ్డుకు శంకుస్థాపన, రూ.8.65లక్షలతో నిర్మించిన మడకపాలెం అంగన్వాడీ భవనం ప్రారంభోత్సవం ఉంటాయన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అన్ని రంగాల్లో వైసిపి విఫలం



ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో తాతయ్య బాబు, తదితరులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రజాకంటక పాలన సాగిస్తున్న వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని, చోడవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న మదిన, కొండపాలెం, కెపి.అగ్రహారం గ్రామాల్లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రానికి అప్పులు, రోడ్లన్నీ గుంతలు, ప్రశ్నించేది ఎవరైనా దాడులు, జగన్‌ప్రభుత్వానికి నిత్యకృత్యమయ్యాయని మండిపడ్డారు. కార్యక్రమంలో గోకివాడ కోటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ కోరుకొండ రవికుమార్, సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు, మాజీ జెడ్‌పిటిసి వెయ్యపు అప్పారావు, మాజీ సర్పంచులు దొంకిన అప్పలనాయుడు, కోటా సత్యనారాయణ, కొర్ని జోగినాయుడు, పచ్చికూర మాణిక్యం పాల్గొన్నారు

పేదలకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న విజయలక్ష్మి

ప్రజాశక్తి- దేవరాపల్లి : జిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత గొర్లె శ్రీనివాసరావు (జిఎస్ఆర్)తల్లి పార్వతమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం ఆదివారం ఎం .అలమండ గ్రామం చర్చిలో ఆమె సహచరులకు, స్నేహితులకు, బంధువులకు, కొంతమంది పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు గొర్లె శ్రీనివాసరావు సతీమణి గొర్లె విజయలక్ష్మి పాల్గొని వస్త్రాల పంపిణీతోపాటు పాస్టర్లకు వస్త్రాలు, ఆర్థిక బహుమతి అందించారు.

వైసిపిలో చేరిన పాల సొసైటీ అధ్యక్షుడు



సూర్యనారాయణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి.- సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పాల సొసైటీ అధ్యక్షులు బోకం సూర్యనారాయణ టిడిపి నుంచి వైసిపిలో చేరినట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సమక్షంలో సూర్యనారాయణను పార్టీ కండువా కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. సూర్యనారాయణతో పాటు మూడో వార్డు మెంబర్ బోకం సింహాచలం, బోకం జగదీశ్వరరావు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో సబ్బవరం వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైలపుడి భగవాన్ జయరాం, అంతకపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాల నాయుడు, ఉప సర్పంచ్ అప్పారావు, మాజీ సర్పంచ్ దేముడు బాబు, సచివాలయం కన్వీనర్ ఎర్రి నాయుడు, సబ్బవరపు శ్రీను, గొంప రమణ, శ్రీరామమూర్తి, బోకం శ్రీను పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం



కశింకోటలో పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న రూపవతి

ప్రజాశక్తి -అనకాపల్లి : విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలను గురుకుల కళాశాలల జిల్లా సమన్వయకర్త ఎస్ రూపవతి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ అనకాపల్లి జిల్లాల్లో 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించామన్నారు.. విశాఖపట్నం జిల్లాలో ఐదో తరగతి ప్రవేశానికి 749 మంది దరఖాస్తు చేయగా 553 మందితో 75 శాతం హాజరయ్యారు. అలాగే అనకాపల్లి జిల్లాలో 2746 మంది దరఖాస్తు చేసుకోగా 2297 మందితో 83 శాతం హాజరయ్యారు. అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్షకు విశాఖ జిల్లాలో 452 మంది దరఖాస్తు చేయగా 334 మంది, అనకాపల్లి జిల్లాలో 1517 మంది దరఖాస్తు చేసుకోగా 1166 మంది విద్యార్థులు హాజరయ్యారు. కలెక్టర్ల ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులు, ఆయా ఎంఇఒలు, తహశీల్దార్లు, పోలీసు సిబ్బంది పరీక్షల నిర్వహణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎటువంటి లేకుండా మంచినీటి సౌకర్యం, టెంట్లను వేశారు.

దేవరాపల్లి : తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో. 5వ తరగతి, ఇంటర ఫస్టియర్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక గురుకులంలో 5వ తరగతికి 474 మందికిగాను441 మంది హాజరు కాగా, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 82 మందికి 13 మంది విద్యార్థులు గైరాజరయ్యారనిగురుకుల ప్రిన్సిపాల్ సిహెచ్ రవీంద్రనాథ్ తెలిపారు అధ్యాపకులు బి రామకృష్ణ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు.

కశింకోట: మండలంలోని తాళ్ళపాలెం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అయిదవ, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశ పరీక్షను మ్మడి జిల్లాల గురుకులాల సమన్వయకర్త రూపావతి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మళ్ళ మాణిక్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

గొలుగొండ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ మాట్లాడుతూ, ఐదవ తరగతిలో ప్రవేశ పరీక్ష కోసం 246మంది, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశపరీక్ష కోసం 139 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షల అబ్జర్వేటర్‌గా సబ్బవరం ఉపాధ్యాయులు కోటేశ్వరరావు బాధ్యతలు నిర్వహించారు.

అవాస్తవ ప్రచారాలపై చర్యలు తీసుకోండి



సిఐకి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ శేఖర్

ప్రజాశక్తి - పరవాడ: తనను, తన కుటుంబాన్ని అప్రతిష్టపాలుజేసి, రాజకీయంగా దెబ్బతీయాలనే కుట్రతో యూట్యూబ్ ఛానల్, వాట్సాప్ గ్రూపుల్లో అవాస్తవ కథనాలను ప్రసారం చేస్తున్న ఎటువంటి గుర్తింపులేని కొంతమంది విలేకరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భరిణికం సర్పంచ్, వైసిపి నేత పెదిశెట్టి శేఖర్ కోరారు. ఈ మేకు పరవాడ సిఐ పి.ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. భరణికంలోతన తల్లి కళావతి పేరున 2020లోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న సర్వేనెంబరు 72లోని 10.50సెంట్లు గ్రామకంఠం స్థలంలో తన వ్యక్తిగత కార్యాలయం నిర్మించుకుని, కారు పార్కింగ్‌కు వినియోగించుకుంటున్నామన్నారు. గతంలో కొంతమంది ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు వస్తే పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. ఈ నేపథ్యం శుక్రవారం గణపతిరాజు సుశీల, బోని గణేష్ అనే వ్యక్తులు దౌర్జన్యంగా తన స్థలంలోకి వచ్చి, ప్రెస్‌మీట్ పేరుతో అసత్యఆరోపణలు చేస్తే, వాటిని పప్పల నీలకంఠరావు. నేతల సోమేశ్వరరావు యూట్యూబ్ ఛానల్, సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై న్యాయస్థానంలో పరువు నష్టం దావా వేశానని శేఖర్ తెలిపారు.

సేవా కార్యక్రమాలతో నవరాత్రి ఉత్సవాలు




పిల్లలకు చాక్లెట్లు , బిస్కట్లు అందిస్తున్న వైశ్య ప్రతినిధులు

ప్రజాశక్తి -అనకాపల్లి : శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 30 వరకు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వెంకుపాలెం హదయ శాంతి వృద్ధాశ్రమంలో రొట్టెలు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సీఎస్ఐ పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు, పౌష్టికాహార ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో సమితి జిల్లా ఉపాధ్యక్షులు మండవిల్లి రామచంద్ర నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి ఆర్ ఎల్ నారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షులు పి ఎం ఎల్ నరసింహం, సభ్యులు పాల్గొన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు

వీధిదీపాల నిర్వహణలో నిర్లక్ష్యం



పడాలవీధిలో పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు

ప్రజాశక్తి- యలమంచిలి రూరల్ : పట్టపగలే దేదీప్యమానంగా వెలుగుతోన్న విద్యుత్ దీపాలు సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. ఒకవైపు విద్యుత్ ఆదా అంటూ ఊదరగొడుతున్న అధికారులు, ఈ వృథాను ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధి 17 వ వార్డు రామ్‌నగర్ పడాల వారి వీధిలో మధ్యాహ్నం మూడు గంటలు సమయంలో విద్యుత్ దీపాలు వెలుగుతూ దర్శనమిచ్చాయి. స్థానికులను వివరణ అడగగా ఉదయం నుంచి వెలుగుతూ ఉన్నాయని చెబుతున్నారు. విలువైన విద్యుత్తు వృథా అవుతుందని, ఫలితంగా విద్యుత్ శాఖ తీవ్రంగా నష్టపోతుందని, ఆ భారం తిరిగి ప్రజల మీదే పడుతుందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళ తెరిచి పగటిపూట విద్యుత్ వెలుగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- వడ్డాది : బంగారుమెట్ట, ఎల్‌బి పురం జంటగ్రామాల్లో ఏడేళ్ల తర్వాత సోమవారం నిర్వహించే గౌరీ పరమేశ్వరుల ముగింపు ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోవిడ్ కారణంగా గడచిన ఆరేళ్ల ఈ పండుగను నిర్వహించలేదు. ఈ నేపథ్యం. పూర్వ సాంప్రదాయం ప్రకారం దొండావారి వంశస్థులు పాత మేడ వద్ద గౌరీ పరమేశ్వరుల నిలుపు ఉత్సవాన్ని ప్రారంభించి, ఆరు నెలలుగా ప్రతిరోజు నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. గౌరమ్మకు భారీ ఎత్తున సారే సమర్పించారు. సోమవారం ముగింపు ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు .పురవీధుల్లో నేల వేషాలు బళ్లవేషాలు,ప్రతి వీధిలోను సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సాంఘిక, జానపద, ఆధునిక, సినీ సంగీత సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎడ్ల పరుగు పందేలు,విశాఖ వారిచే ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బుచ్చయ్యపేట ఎస్ఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పండుగ నేపథ్యంలో ఇళ్లన్నీ బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి.

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -అనకాపల్లి : నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఉదయం నుంచి క్యూలైన్లలో బారులుదీరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా ఆలయ ఇఒ బండారు ప్రసాద్, సిబ్బంది తగుజాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు మజ్జిగ మంచినీరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పంపిణీ చేశారు. అనకాపల్లి ఫైనాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా భూలోకమాంబ పండగ



పండగలో పాల్గొన్న గవరెడ్డి రామానాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని కింతాడ శివారు గొల్లలపాలెం గ్రామంలో భూలోకమాంబ మొక్కుబడి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కింతాడ టిడిపి అధ్యక్షుడు ఒమ్మి మంగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పెదనందిపల్లిలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి- దేవరాపల్లి: మండలంలోని పెదనందిపల్లిలో సోమవారం నియోజకవర్గస్థాయి మెగా పశువైద్యశిబిరం నిర్వహించనున్నట్లు దేవరాపల్లి పశువైద్యాధికారులు డాక్టర్ అలేఖ్య, మంజూషారాణి తెలిపారు. శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభిస్తారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ వితరణ చేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - యలమంచిలి : మండుతున్న ఎండల్లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఆదివారం సైతారుపేట రోడ్డు, ద్వారకానగర్ కృష్ణుడి గుడి వద్ద మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశామని స్థానిక యాదవ సంఘం పెద్దలు తెలిపారు. వీటిని రేఖా శ్రీనివాస్ ప్రారంభించారు. చలివేంద్రాలు నిర్విఘ్నంగా కొనసాగేందుకు దాతలు ముందుకు రావాలని యాదవ పెద్దలు కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ధూళి దేముళ్ళు, కార్యదర్శి వియ్యపు గోపి, గొలగాని సన్నిబాబు, శీర అచ్చిబాబు, కోన శంకర్రావు, వి.శ్రీను పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్య మిథ్యేనా..

-చెల్లించని విద్యుత్ బిల్లులు
-సరఫరా నిలిపివేసిన అధికారులు
-రెండేళ్లుగా నిరుపయోగంగా ల్యాబ్



నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్ ల్యాబ్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసన కంప్యూటర్ ల్యాబ్ రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. ల్యాబ్‌ను ప్రత్యేక కంటెయినర్‌లో ఏర్పాటు చేసి త్రీఫేజ్ విద్యుత్ సదుపాయం కల్పించారు. విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో కరెంట్ సరఫరాను ఆ శాఖ అధికారులు నిలిపివేశారు. అప్పటి నుంచి విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరమయ్యారు.

ఈ పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశ్యంతో 2017-2018లో అప్పటి రోడ్లు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రముఖ కంపెనీ హెచ్‌పి సహకారంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించారు. ప్రత్యేకంగా ఒక కంటైనర్‌ను కొనుగోలు చేసి 16 కంప్యూటర్లతో దీనిని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా విద్యుత్ కనెక్షన్ తీసుకొని రెండు ఏసిలు బిగించారు. అన్నీ కలిపి సుమారు 30లక్షల వ్యయం అయ్యింది. కంప్యూటర్ బోధనకు ప్రత్యేకంగా టీచర్‌ను నియమించారు. రెండేళ్ల క్రితం వరకు ఇది బాగానే సాగింది. తర్వాత విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో ఈపిడిసిఎల్ అధికారులు సరఫరాను నిలిపివేశారు. దీంతో కంప్యూటర్ విద్యాబోధన అటకెక్కింది. రెండు ఏసిలు, 16 కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైట్లు ఉండటంతో అధిక కిలో వాట్ల వాడకం కేటగిరిలో చేర్చారు. ప్రతి నెలా కనీసం బిల్లు రూ.1860 వాడిన విద్యుత్‌ను బట్టి బిల్లు వస్తుంది. పాఠశాలలో నిధులు లేకపోవడంతో రెండేళ్ల నుంచి బిల్లు చెల్లించడం లేదు. ఈపిడిసిఎల్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయినప్పటికీ ప్రతి నెలా రూ.1860 చొప్పున కనీస బిల్లు వస్తుంది. అంతకు ముందున్న బకాయిలతో కలిసి లక్ష రూపాయలు దాటిపోయింది. ఏఎల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 780 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో వీరందరికీ కంప్యూటర్ విద్య అందని పరిస్థితి నెలకొంది.



ఎఎల్‌పురం హైస్కూల్



సన్మానిస్తున్న సంఘ పెద్దలు

జయరాజ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో డాక్టర్ పి.జయరాజు చేసిన పలు సేవలను గుర్తించి యూనివర్సల్ చర్చి మినిస్ట్రీస్ ఆర్గనైజేషన్ నెట్వర్క్ డాక్టరేట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో పెద్దలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన పి జయరాజ్ మాట్లాడుతూ, 16 సంవత్సరాలుగా అందించిన సేవలను గుర్తించి డాక్టరేట్ బహుకరించారని తెలిపారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 20వ వార్డు కృష్ణాపురం నుంచి నర్సీపట్నంటౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో జనసేన నేత సూర్యచంద్ర సమక్షంలో బీసీ సామాజిక వర్గానికి వైసిపి పార్టీకి చెందిన 50 మంది కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. ఈ మేరకు సూర్యచంద్ర పార్టీ కండువా చేసి సాధనంగా ఆహ్వానించారు.

నత్త నడకన రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి- కోటవురట్ల: రామచంద్రపురం వద్ద ఆర్ అండ్‌బి రోడ్డు నుండి గిరిజన గ్రామం అల్లుమయ్యపాలెం వెళ్లే రోడ్డు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. రూ.3.30 కోట్ల ఉపాధి హామీ నిధులతో 5 కి.మీ మేర తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి సంవత్సరం పూర్తయిన నేటికీ మట్టి పనులు మాత్రమే జరుగుతూ ఉండటం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇంతవరకు కేవలం రోడ్డు నిర్మాణంకు క్వారీ రబ్బిష్ పనులు మాత్రమే జరిగాయని, రబ్బిష్ వది లేయడంతో రాత్రి ప్రయాణించే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంతవరకు కేవలం 20 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడం పట్ల సమీప ప్రాంత రైతులు, విద్యార్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుకుంటున్నారు.



క్వారీ రబ్బిష్ వేసి వదిలేసిన రోడ్డు,

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆదివారం పాత కృష్ణదేవిపేటలో స్థానిక సర్పంచ్ పందిరి సత్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. అంజు కంటి ఆసుపత్రి (కాకినాడ) సౌజన్యంతో స్థానిక రామాలయం వద్ద ప్రారంభమైన ఈ శిబిరంలో సుమారు వందమంది రోగులకు వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారిలో 22 మందికి ఆపరేషన్ అవసరమని వైద్య బందం నిర్ధారించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సమస్యలపై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ఈ శిబిరంలో స్థానికులతో పాటుగా నాగపురం, పల్లావూరు, ఏ ఎల్ పురం, బంగారు మెట్ట, కొంగసింగి తదితర గ్రామాల నుండి రోగులు తరలివచ్చారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పుస్తక పఠనంతో విజ్ఞానం



నక్కపల్లిలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

ప్రజాశక్తి- నక్కపల్లి : విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం చేయడంతో మేధస్సు పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి జనార్ధన్ అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులకు, చిన్నారులకు అవసరమగు నీతి కథలు, చరిత్ర, జనరల్ నాలెడ్జ్ తదితర పుస్తకాలను అందుబాటులో ఉంచారు.విద్యార్థులతో పలు పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలన్నారు. చిన్నతనం నుండే పుస్తక పఠనం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటి చైర్మెన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ ,పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ : గొలుగొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం లైబ్రరియన్ రాజబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుస్తకం ప్రాముఖ్యతను పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల బాలికలు పాల్గొన్నారు.



గొలుగొండలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు



భాస్కర నాయుడును సన్మానిస్తున్న పాత్రికేయులు

ప్రజా సమస్యలను వెలుగులోకి తేవాలి

ప్రజాశక్తి-గొలుగొండ: పాత్రికేయులంతా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ అంకితభావంతో పనిచేయాలని నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు సూచించారు. మండలంలో ఏఎల్ పురం అల్లూరి పార్కులో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు స్వామి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత్రికేయలంతా ప్రజల పక్షాన నిలబడుతూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకురావాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు అనంతరం చిటికెల భాస్కర నాయుడును సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెలపు మణికుమారి, జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.నానాజీ, ఎంపీటీసీ చింతల బుల్లి ప్రసాదు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలపై
ఎమ్మెల్యే గణేష్ సవాల్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: రంగురాళ్ల తవ్వకాలపై ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అయ్యన్నకు సవాల్ విసిరారు. మీడియాకు పంపించిన వీడియోలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగురాళ్లపై తాను ఒక్క రూపాయి సంపాదించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానన్నారు.



నిరూపించకపోతే అయ్యన్న రాజకీయాలు నుంచి తప్పుకుంటాడా అని అన్నారు. ఆనాడు రంగురాళ్ల తవ్వకాలు ప్రారంభించింది అయ్యన్న, తనయుడు విజయ్ అని విమర్శించారు. కోట్లాది రూపాయిలు విలువ చేసే లేటరైట్ ను నువ్వు నీ కొడుకు తవ్వుకు పోయారని, మంత్రిగా ఉన్నప్పుడు గంజాయికి నర్సీపట్నం అడ్డగా మార్చింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. ఇన్ని పనులు చేసిన ఆయనను చూస్తుంటే సిగ్గేస్తుందని నర్సీపట్నం పరువు తీసాడని అన్నారు. తవ్వకాలు జరగలేదని మట్టి తరలించలేదని అటవీ శాఖ అధికారులు తెలియజేసినప్పటికీ తమపై బురదజల్లేందుకే ఇటువంటి తప్పుడు ప్రయత్నాలు మారుకోవాలని అన్నారు. గతంలో ఆర్లి అడవిలో రంగురాళ్ల తవ్వకంలో అరెస్టు చేయబడ్డవారు తెలుగుదేశం పార్టీ వాళ్ళని వారి పేర్లు తమ దగ్గర ఉన్నాయని విమర్శించారు.



ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్ రమణ

వైసిపితోనే ప్రజా సంక్షేమం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఆదివారం పుత్తడిగైరం పేట శివారు పల్లపు నాగేంద్రపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం స్థానిక సర్పంచ్ పత్తి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను తెలియజేసి, స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పత్తి రమణ మాట్లాడుతూ, సంక్షేమ పాలన వైసీపీతోనే సాధ్యమన్నారు. పంచాయతీలో ప్రతి ఇంటికి వెళ్లి పథకాలను వివరించారు.

పెదబయలులో వడగళ్ల వాన

ప్రజాశక్తి-పెదబయలు : మండల కేంద్రంలో ఆదివారం జోరున వర్షం కురిసింది. తెల్లారు జామున విపరీతమైన గాలి వర్షం రావడంతో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులతో గాలి. వర్షం. కురిసింది.



ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో మందులు కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆదివారం డిమాండ్ చేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 507వ రోజుకు చేరింది. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు ఆకులు, గడ్డి తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. హెటిరో డ్రగ్స్ మందుల కంపెనీ వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదలడంతో చేపలు మృత్యువాత పడడంతో వేటసాగక ఉపాధి కోల్పోయి ఈ విధంగా ఆకులు, గడ్డి తింటూ జీవించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో తమ కు జీవన ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వెలబుచ్చారు. చేపలు వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదని ,కొత్త పైపు లైన్ వేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోసల సోమేశ్వరరావు, పిక్కి రమణ, వాసుపల్లి సోమి, చేపలు సోమేష్, బొంది నూకరాజు, మైలపల్లి బాపూజీ, పిక్కి రాజు, మైలపల్లి నరేష్, కొత్వాల్ కాశీ, మైలపల్లి శివాజీ, చోడిపల్లి రాజు, పిక్కి సత్తిరాజు, మైలపల్లి దార్రాజు, పిడిమి తాతాజీ, తండేలా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.



చెత్తా చెదారం తొలగిస్తున్న వాలంటీర్లు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసేస్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సీతారామపురం గ్రామంలో ఆదివారం స్వచ్ఛభారత్‌ను చేపట్టారు. ఇ ందులో భాగంగా గ్రామాన్ని శుభ్రపరిచారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వివిధ వ్యాధుల వ్యాప్తి, లక్షణాలు పట్ల ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చేందుకు ర్యాలీ చేపట్టారు. వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం గ్రామ సర్పంచ్ పీ.వెంకటకృష్ణ, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జీ.టీ.నాయుడు, భాస్కర్ రావు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వనితకు భరోసా.... మహిళా సమ్మాన్



▶▶ తపాలా శాఖలో పథకం ప్రారంభం ▶▶ వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వడ్డీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన పథకం ఏప్రిల్ నుంచి తపాలా శాఖలో ప్రారంభమైంది. ఈ పథకంలో వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వడ్డీ లభిస్తుంది.ఈ పథకం గురించి మరిన్ని వివరాలను ఐ.కుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, నర్సీపట్నం ఈస్ట్‌సబ్‌డివిజన్ అధికారి ప్రజాశక్తికి తెలియజేశారు. ఈ వివరాలు..

ఈ పథకంలో మనం డబ్బును రెండేళ్లపాటు పెట్టుబడి పెట్టవచ్చు. తక్కువ కాల వ్యవధి పెట్టుబడిపై వడ్డీని పొందవచ్చు. దీంతో పాటు ఈ స్కీంలో పెట్టుబడి పెట్టడానికి ఎటువంటి వయో పరిమితిని నిర్ణయించలేదు. ఏ వయస్సులో ఉన్న బాలికలు, మహిళలైనా ఇందులో పెట్టుబడి పెట్టొచ్చు. పథకం మధ్యలో డబ్బు అవసరమైతే పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో పోస్టల్ శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలను ప్రవేశపెట్టింది.

2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనల్లో మహిళలకు ప్రయోజనం చేకూర్చే విదంగా మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన స్కీం కొరకు పోస్టాఫీసులో ఖాతా తెరవచ్చు. ఈ పథకంలో రూ.2లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. దీని కాలపరిమితి 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం చిన్న మొత్తాల పొదుపు, బాలికల కోసం ఉద్దేశించిన సుకన్య సమద్ధి యోజన ,పదకానికి 7.60 శాతం, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం కోసం 8 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ రెండు పథకాల తర్వాత అధిక వడ్డీ రేటు ఇస్తున్న పథకం ఇదే కావడం విశేషం.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పొందాలనుకునేవారు సమీపంలోని పోస్టాఫీసును సందర్శించి మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన ఫారం తీసుకోవాలి. వ్యక్తిగత, ఆర్థిక వివరాలను అందులో దరఖాస్తు పూర్తి చేయాలి. డిపాజిట్ మొత్తాన్ని ఎంచుకుని, నగదు రూపంలోనూ, చెక్, రూపంలోనైనా డిపాజిట్ చేయవచ్చు. పెట్టుబడికి రుజువుగా సర్టిఫికేట్‌ను ఇస్తారు.

ఎంత వడ్డీ వస్తుంది

రెండేళ్లపాటు ఈ పథకం గరిష్ట పరిమితి రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి పెడితే.. ఏడాదికి 7.50 శాతం వడ్డీ చొప్పున మొదటి ఏడాదిలో రూ.15వేలు, రెండవ ఏడాదిలో రూ.16,125లు మొత్తంగా రూ. 31,125లు వడ్డీ పొందవచ్చు.

మహిళలకు మాత్రమే ఈ పథకం

మహిళలు మాత్రమే ఈ పథకంతో తక్కువ సమయంలో ఎక్కువ రాబడి పొందేలా ఏడాదికి 7.5శాతం వడ్డీని ఇవ్వనుంది. ఇందులో కనీసం రూ.1000ల నుంచి గరిష్టంగా రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఒక అకౌంట్ ఓపెన్ చేసిన తర్వాత మూడు నెలల తర్వాత మళ్లీ అకౌంట్ ఓపెన్ చేసుకునే అవకాశం కలదు. ఈ పథకం కాల పరిమితి రెండేళ్లు మాత్రమే. ఈ పథకం కింద వడ్డీని ప్రతి మూడు నెలలకొకసారి ఖాతాలో జమ చేయబడును. వివరాల కోసం దగ్గరలోని పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించండి. ఈ పథకాన్ని అవకాశం ఉన్న వారంతా వినియోగం చేసుకోవాలి.



ఐ.కుమార్
పోస్టల్ ఇన్స్పెక్టర్,
నర్సీపట్నం ఈస్ట్ సబ్ డివిజన్

ఉత్సాహంగా ప్రచార భేరి

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలోని రత్నగిరినగర్, శతాబ్దినగర్, లక్ష్మీనగర్, గొల్లవిల్లిపాలెం, ఎల్ఐసి కాలనీ, ఎన్ఎడి లే-అవుట్, పాపయ్యరాజుపాలెంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.శ్రీనివాసరావు, సిపిఐ నాయుకులు కె.నారాయణరావు, ఎం.రాము, ఎ.రమణ, మిన్నారావు, సిపిఎం నాయకుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు.

గాజువాక : పెదగంట్యాడ, నడుపూరు, చినకోరాడ, పెద్దకోరాడలలో సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొవిరి అప్పలరాజు, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, సిహెచ్.రాముడు, బి.ఆనంద్, బిఎస్.ప్రసాద్, ఎల్.బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రజల సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేసి, ఆదానీ అంబానీ సేవల్లో తరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం నేవీ కాలనీలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు, ప్రజలపై భారాలను మోపే మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేలా ప్రజలను చైతన్యవంతం చేయడం, అవగాహన కల్పించడమే ప్రచారభేరి పాదయాత్రల లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బిజెపిని ఓడిస్తేనే దేశానికి, రాష్ట్రానికి మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్. శివాజీ, చెల్లూరి నూకన్న, సమ్మిట్ల, వరహాలరావు, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.



పెందుర్తిలో...



గాజువాకలో చేపడుతున్న ప్రచారం



రాంబిల్లిలో...

యువత టెక్నాలజీపై దృష్టి పెట్టాలి

మాజీ మంత్రి , టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్న

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : యువత టెక్నాలజీని అందుపుచ్చుకోవాలని, సోషల్ మీడియా వేదికగా సమాచారాన్ని మరింత విస్తతం చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు సూచించారు. సోషల్ మీడియా విస్తరణలో భాగంగా నర్సీపట్నంలో కల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ నేతత్వంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా యువసేన రాజేష్ హాజరయ్యారు. ముందుగా స్థానిక కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, ప్రచారంలో సోషల్ మీడియా ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు సోషల్ మీడియాను యువత ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోడి కత్తి డ్రామా నుండి గొడ్డలి పోటు వరకు అనేక డ్రామాలాడి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డికి అధికారం చెల్లినట్లేనని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే అనుచరగనం రంగురాళ్ల తవ్వకాలకు, గంజా వ్యాపారాలకు ఎగబడుతున్నారని ఆయన విమర్శించారు.

విజయ్ మాట్లాడుతూ, ఒకానొకప్పుడు నర్సీపట్నంలో విద్యా, వైద్యర రంగాలలో అయ్యన్న అభివద్ధి చేశారని, ఈ తుగ్లక్ ప్రభుత్వం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ను మాస్క్ అడిగినందుకు చంపేశారని విమర్శించారు. రాష్ట్రం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. యువసేన రాజేష్ మాట్లాడుతూ, తాను వైసీపీలో ఉన్నప్పుడు వారిచ్చే తప్పుడు సమాచారంతోనే అయ్యన్నను విమర్శించానని, తనను క్షమించాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్న

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వడ్డీబోయిన సుజాత ఆదివారం సందర్శించారు. ఖైదీలకు అందించే వసతి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలులో వారికి అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. ఖైదీల సంక్షేమం గురించి కృషి చేయాలని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీల ద్వారా తయారయ్యే ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్శనలో ఖైదీల దినచర్య, ఖైదీలకు లభించే సౌకర్యాలు, సంక్షేమం గురించి హైకోర్టు న్యాయమూర్తి సుజాతకు జైలు పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ అధికారులు గీత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సోనీ, కారాగార అదనపు పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి సిఎస్.రావు, చంద్రరావు పాల్గొన్నారు.